క్లుప్తంగా

నేడు జొన్నలగడ్డలో గడపగడపకు మన ప్రభుత్వం

నరసరావుపేట: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించటం జరుగుతుందన్నారు. కావున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నగరవనం పనుల పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని వెంకుపాలెం గ్రామ శివారులో ఫారెస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న వినుకొండ నగరవనం పనులను గుంటూరు సర్కిల్ అటవీ సంరక్షణ అధికారి వై. శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అటవీ శాఖ అధికారులకు, సిబ్బందికి నగరవనం నిర్మాణంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రజలకు చేరువగా నగరవనాలను తీర్చిదిద్దడం వంటి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సయ్యద్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సురేంద్ర, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): బాలవికాస్ వారి సహకారంతో నూజెండ్ల మండలం బుర్రిపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామంలో ప్రజల సౌకర్యార్థం గంటకు 500 లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ పథకం కింద పైపులైన్, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వాటర్ గ్రిడ్ నుంచి అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, తన్నీరు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విరాళమిచ్చిన దాతకు సన్మానం



వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని మదమంచిపాటి వీరాంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురం నిర్మాణానికి దేవాదాయ శాఖ సీజీఎఫ్ ఫండ్ కింద రూ.50 లక్షల నిధులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. అలాగే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నూజెండ్ల మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కాటిరెడ్డి కోటిరెడ్డి రాజగోపురం నిర్మాణానికి రూ.16.66 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన కార్యాలయంలో దాత కోటిరెడ్డిని శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జక్కిరెడ్డి సుబ్బారెడ్డి, కార్యనిర్వహణ అధికారి పుణ్యాల వెంకటరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీయూ సంఘం నూతన కార్యవర్గం



కంప శ్రీనివాసరావు రాజా రమేష్

శావల్యాపురం: ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం ఎంపిక గురువారం జరిగింది. ఎస్టీయూ సంఘం మండల గౌరవ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు (మతుకుమల్లి) మండల అధ్యక్షులుగా కంప శ్రీనివాసరావు (శావల్యాపురం) ప్రధాన కార్యదర్శి బిల్లా రాజారమేష్ (తుమ్మలకుంట) ఆర్థిక కార్యదర్శి నూకల శ్రీనివాసరావు (బొందిలిపాలెం) మహిళ కన్వీనర్ టి.నిర్మల కుమారి, సీపీఎస్ కన్వీనర్ నేమలికంటి ప్రవీణ్, ఉపాధ్యక్షులు మధుబాబు, రత్నకిషోర్, కార్యదర్శులుగా సుభాసిని, మనోరమ, జిల్లా కన్వీనర్‌గా కొండ్రముట్ల వెంకట రత్నం, సురేష్, రత్నలతలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .



శావల్యాపురం నుంచి కార్యక్రమానికి తరలివెళ్తున్న వలంటీర్లు



కనపర్రులో సభకు తరలివెళ్తున్న వలంటీర్లకు జెండా ఊపి సాగనంపుతున్న సర్పంచ్



బొల్లాపల్లి నుంచి వలంటీర్లకు కలసి తరలి వెళ్తున్న ఎంపీడీఓ

ఛలో ఫిరంగిపురం

శావల్యాపురం: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వరుసగా నాల్గవసారి వలంటీర్లకు అభినందన సభ కార్యక్రమానికి మండలం నుంచి ప్రత్యేక వాహనాల్లో మండల వలంటీర్లు తరలివెళ్లినట్లు ఎంపీడీవో కొత్రపాటి కవితా చౌదరి గురువారం తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో 203 వలంటీర్లు నాలుగు బస్సుల్లో ఫిరంగిపురంలో ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కార్యక్రమానికి తరలివెళ్ళినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీయం జి.వాసుబాబు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాదెండ్ల నుంచి....

నాదెండ్ల: నిజాయితీగా, సేవే లక్ష్యంగా వలంటీర్లు సమాజానికి సేవలందిస్తున్నారని సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు చెప్పారు. ఫిరంగిపురం మండలం రేపూడిలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రానున్న వలంటీర్ల అభినందన సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో వలంటీర్లు తరలివెళ్లారు. కనపర్రు గ్రామంలో సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల దరికి చేర్చటంలో వలంటీర్ల కృషి ఎనలేనిదన్నారు. ఎలాంటి పక్షపాతం, అవినీతికి తావులేకుండా క్షేత్రస్థాయిలో విశిష్ట సేవలందిస్తున్నారన్నారు. వలంటీర్ల సేవలకు అభినందనగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వలంటీర్లకు అవార్డులు అందించటం గొప్ప విషయమన్నారు.

బొల్లాపల్లి నుంచి...

బొల్లాపల్లి: ఫిరంగిపురంలో వలంటీర్లుకు వందనం కార్యక్రమానికి మండలం నుంచి వలంటీర్లు గురువారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి 7 వాహనాల్లో వలంటీర్లు తరలివెళ్లారని ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- గ్రామపరిపాలన వ్యవస్థతో నూతన ఒరవడి
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వనికుంటలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని వనికుంట గ్రామంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను గురువారం ఎమ్మెల్యే బొల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామపరిపాలన వ్యవస్థ ద్వారా నూతన ఒరవడి తెచ్చారని, ఈ పాలనలో ప్రజల ఆరోగ్యం కోసం హెల్త్ క్లినిక్‌లు, రైతులకు అన్ని సౌకర్యాలు, హంగులతో రైతు భరోసా కేంద్రాలు, పరిపాలనలో సచివాలయాలు తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందజేయడంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో నేతలు కొవ్వొత్తులా కరిగిపోయి ప్రజలకు సేవలు అందించడంలో ముందు చూపుతో ఉన్నారన్నారు. నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలు కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని తెలిపారు. నేరుగా పథకాలు లబ్ధిదారుల చెంతకే చేరుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రజలకు ఏం చేశారో టీడీపీ ఆలోచించుకోవాలని, మాజీ సీఎం చంద్రబాబుకు ఈ సంక్షేమం అప్పట్లో గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. గతంలో జన్మభూమి కమిటీలు, నీరు–చెట్టు తదితర కమిటీల పేరుతో ప్రజలను నిలువుదోపిడీ చేశారని విమర్శించారు. దుర్మార్గపు ఆలోచనలతో అబద్ధాలు, మోసపూరితమైన వాగ్దానాలతో టీడీపీ అధికారంలోకి రావడానికి కుయుక్తులు పన్నుతోందని, ప్రజలు గుర్తుంచుకుని తిప్పికొడతారని అన్నారు. పెత్తందారులు, రౌడీయిజం వంటి ప్రణాళికలతో రాబోయే ఎన్నికల్లో టీడీపీ చేసే దుర్మార్గాలను ప్రజలు ఎదుర్కొంటారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని, సంక్షేమం, ప్రజారంజకపాలనతో పేరు తెచ్చుకున్నారని, ప్రజలు గుర్తించి మరోమారు జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టబెట్టే అవకాశం మెండుగా ఉందన్నారు. బాబు గారిడీ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రూ.2.40 లక్షల కోట్లతో ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేశారని, అప్పట్లో 1906లో జరిగిన రీసర్వే అనంతరం ప్రస్తుత ప్రభుత్వం భూరీసర్వే చేపట్టి రైతులకు మేలు చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో ఓట్ల కోసం తెలుగుదేశం దొంగలబ్యాచ్ వస్తుందని దోపిడీకి అవకాశం ఇవ్వద్దని అన్నారు.

14 ఏళ్ల పాలనలో చేయని చంద్రబాబు మరోసారి అవకాశం ఇస్తే ప్రజలకు ఏదో చేస్తానని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుర్లపాటి చౌదయ్య, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మెంబరు గూండాల స్వెనోమ్, మండల పార్టీ అధ్యక్షుడు కోపెల దేవరాజు, గ్రామసర్పంచ్ బత్తినబోయిన సుబ్బయ్య, అంగలూరు సొసైటీ ప్రెసిడెంట్ దుద్దుగుల శ్రీనివాసరావు, ఈపూరు సొసైటీ ప్రెసిడెంట్ బొల్లా బుజ్జి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకట హనుమయ్య పాల్గొన్నారు.

నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్‌గా వాసుదేవరెడ్డి

ఎమ్మెల్యే గోపిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియచేసిన ఆర్యవైశ్య నాయకులు



వాసుదేవరెడ్డికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఉప్పలపాడు గ్రామానికి చెందిన శనివారపు వాసుదేవరెడ్డి నియమితులయ్యారు. గురువారం పార్టీ కార్యాలయంలో ప్రభుత్వం జారీచేసిన నూతన కార్యవర్గ ఉత్తర్వులను వాసుదేవరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. అలాగే కార్యవర్గంలో పలు గ్రామాలు, పట్టణానికి చెందిన వారు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా పులుసు అన్నపూర్ణమ్మ, డైరెక్టర్లుగా పి.రామయ్య, నక్కా వెంకటేశ్వరరావు, బత్తుల పద్మలత, షేక్ బీబీ ఆశ, కుంభ శ్రీనివాసరావు, పెనుగొండ ప్రభాకర్, తడికమల్ల చిన్నకోటేశ్వరరావు, బి.రామనాగేశ్వరరావు నియమితులయ్యారు. రైతులకు ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగు మందులు అందిస్తూ వారికి మేలు చేయాలని కోరారు. తనపై నమ్మకాన్ని ఉంచి యార్డు చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వాసుదేవరెడ్డి, ఆర్యవైశ్య నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ వడ్డే దేశింగరావు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఊర బాస్కరరావు, నాయకులు పెనుగొండ వెంకటేశ్వరరావు, వద్దుల సుబ్బారెడ్డి, శనివారపు వీరారెడ్డి, సుబ్బారెడ్డి, దేవరపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వి.సాంబశివరావు, దివ్వెల రామకృష్ణ, మిరియాల నరహరిరావు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి



చిలకలూరిపేటటౌన్: ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని పల్నాడు జిల్లా డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ చెప్పారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో గురువారం రాత్రి గ్రామస్తులకు రానున్న ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఘర్షణలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు చేస్తామన్నారు. మద్యం విక్రయాలు గ్రామాల్లో అనధికారికంగా కొనసాగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ జగదీష్, రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదుకు గడువు పొడిగింపు

నకరికల్లు: రబీలో సాగు చేసిన పంటలకు ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటివరకు 7,187 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదైందని పేర్కొన్నారు. ఇప్పటి దాకా 5,830 ఎకరాలకు మాత్రమే ఈకేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన రైతులంతా త్వరితగతిన చేయించుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని ఆయన తెలిపారు.

పారదర్శకంగా ఓటరు జాబితా తయారీకి చర్యలు

పెదకూరపాడు: ఓటరు జాబితా పారదర్శకంగా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి నాగజ్యోతి అన్నారు. ఓటరు జాబితాల్లో డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లపై బూత్ లెవెల్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓటరు ముసాయిదా విడుదల చేసిన నా టి నుంచి ఫారం–6 1449, ఫాం–7 1045, ఫా రం–8 482 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని ఆమె చెప్పారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. 21 సంవత్సరాల పైబడి వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వారి నుంచి డిక్లరేషన్ తీసుకోని నమోదు చేసుకోవాలని ఆమె బీఎల్‌ఓలకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు బాలదాసు ఆరాధన మహోత్సవం

కుందురువారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని కుందురువారిపాలెంలో శ్రీ శెట్టిపల్లి బాలదాసు సద్గురువుల 89వ ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సాకి హరికృష్ణ గురువారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో హరేరామ నామ సంకీర్తన చేపట్టారు. ఆరాధనలో భాగంగా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

స్థల వివాదంలో పరస్పర దాడులు

క్రోసూరు: మండలంలోని బయ్యవరంలో ఓ స్థల వివాదంలో పరస్పర దాడుల ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ షఫీ గురువారం తెలిపారు. గత 10 సంవత్సరాలుగా నడిచే దారి విషయం కోర్టులో విచారణలో ఉన్న నేపథ్యంలో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. ఇరువైపులా ఐదుగురికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రి నుంచి ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన తులం కోటేశ్వరరావు ప్రత్యర్థి వర్గానికి చెందిన ఆళ్ల వెంకటేశ్వర్లు, మరో పదకొండు మంది తనను, సోదరుడు తులం వెంకటరావులపై కత్తులు, కర్రలతో దాడి చేయగా సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ప్రత్యర్థి వర్గం ఆళ్ల వెంకటేశ్వర్లు కూడా తులం కోటేశ్వరరావు ,మరో 13 మంది దాడి చేసి ఇనుపరాడ్లతో కొట్టగా తనతో పాటు, తల్లి ఆళ్ల నారాయణమ్మ, సోదరుడు శ్రీనులకు తీవ్ర గాయాలు కాగా గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు.

ప్రజల అర్జీలకు తక్షణ పరిష్కారం

ముప్పాళ్ళ: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ పి.సింగారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, వీఆర్వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు కోసం ఆన్‌లైన్ ద్వారా అందే అర్జీలపై వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని చెప్పారు. తాగునీరు, వెలుతురు, వృద్ధులు నడిచేందుకు వీలుగా ర్యాంపు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారుఉ. ముందుగా ముప్పాళ్ల ఎస్ఐ పి.హజరతయ్య తో మండలంలోని సమస్యాత్మక గ్రామాల, గతంలో చేపట్టిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్, ఆర్ఐలు పవన్‌కుమార్, కపిల్‌దేవ్, ఆంజనేయులు పాల్గొన్నారు

వాహనం ఢీకొని యాచకుడి మృతి

రొంపిచర్ల: మండల పరిధిలోని నరసరావుపేట–పిడుగురాళ్ల రహదారిలోని విప్పర్ల గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం ఓ యాచకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో యాచకుడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార గురువారం తెలిపారు. అల్లూరివారిపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 6 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామానికి చెందిన పి. జగన్నాథంను అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

సమన్వయంతో ఉపాధ్యాయులు పనిచేయాలి

డీవైఈవో వేణుగోపాలరావు



వంకాయలపాడు హైస్కూల్ తనిఖీలో పాల్గొన్న డీవైఈవో కె.వేణుగోపాలరావు

యడ్లపాడు: పదో తరగతి ఉత్తీర్ణతలో పల్నాడు జిల్లాను ముందుండేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని నరసరావుపేట డీవైఈవో కె.వేణుగోపాలరావు చెప్పారు. పాఠశాల వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని వంకాయలపాడు జెడ్పీ హైస్కూల్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. 9, 10వ తరగతి విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయ్యారు. విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే తప్పక అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు దోహదపడతాయన్నారు. ప్రణాళిక ప్రకారంగా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, కాబట్టే విద్యాపరమైన ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి, మన బడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నేరవేర్చడంలో ఉపాధ్యాయులు తమవంతు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనే ఉపాధ్యాయులు కృషికి తార్కాణంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వార్షిక తనిఖీ ప్యానల్ సభ్యులు హెచ్ఎంలు కేవీ రామిరెడ్డి (లింగారావుపాలెం), ఏవీ నాయుడు (తిమ్మాపురం), సుగంధరావు (కారుచోల), విజయభారతి (యడ్లపాడు), ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, జి.శంకరరావు, ఎం.కిర్, డీవైఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంజారా జాతి ఔన్నత్యాన్ని చాటిన సంత్ సేవాలాల్



సంత్‌సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చిలకలూరిపేట: బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని పలువురు ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని గురువారం పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుగాలీలకు ఆరాధ్యదైవమైన సేవాలాల్ అనంతపురం జిల్లా గుత్తి తండాలో జన్మించారని చెప్పారు. ఆయన గిరిజనులకు విద్యను నేర్పించటంతో పాటు అనారోగ్యం బారిన పడిన వారికి మూలికావైద్యం చేసేవారని తెలిపారు. సంచార జీవులుగా ఉన్న గిరిజనులను ఏకతాటిపై తీసుకువచ్చి వ్యవసాయం, సత్ సాంప్రదాయాలపై అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ఎస్టీలపై బ్రిటీష్ ప్రభుత్వం క్రిమినల్ ట్రైబ్స్ అని ముద్ర వేసినప్పుడు వారి కోసం వీరోచిత పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మద్దుల వెంకట కోటయ్య, రైతాంగ పరిరక్షణ సమితి నాయకుడు సింగు లెనిన్ బాబు, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కొండ్రముట్ల నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి

మైనర్లు వాహనాలు నడపరాదు



ఏపీమోడల్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహనలో ఎస్సై ప్రిన్సిపాల్

బొల్లాపల్లి: జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు బండ్లమోటు ఎస్సై డి చెన్నకేశవులు గురువారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు గురించి అవగాహన చేశారు. మైనర్ బాలురు, బాలికలు వాహనాలు నడపరాదని, ప్రమాదాలకు దారితీస్తుందని అన్నారు. ఇటీవల మండలంలో మైనర్ విద్యార్థి వాహనం డ్రైవింగ్ చేసి ప్రాణాలు కోల్పోయాడని, మరో ప్రదేశంలో ప్రమాదం జరిగి అంగవైకల్యం ప్రాప్తించిందని తెలియజేశారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. అతివేగం, ప్రమాదాలకు దారితీస్తుందని, వేగ నియంత్రణ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆటోలు అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించరాదని కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతిఒక్క వాహనదారుడు భద్రతగా వాహనాలు నడపాలని, నిబంధనలు పాటించాలని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.పద్మావతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం



కారెంపూడి: 108 వాహనంలో ప్రసవం జరిగి తల్లీబిడ్డా క్షేమంగా ఉన్న ఘటన గురువారం జరిగింది. బొల్లాపల్లి మండలం రాజానగర్ తండాకు చెందిన ఎం లక్ష్మీబాయి పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108లో గురువారం తెల్లవారు జామున కారెంపూడి పీహెచ్‌సీకి తరలిస్తున్నారు. మార్గంమధ్యలో కారెంపూడి రోడ్డుకు చేరగానే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది వాహనాన్ని రోడ్డు పక్క నిలిపి, కుటుంబానికి చెందిన మహిళల సాయంతో కాన్పు చేయించారు. మగ బిడ్డ పుట్టాడు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను కారెంపూడి పీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు క్షేమంగా ఉన్నారు. కాన్పు చేయించిన ఈఎంటీ బత్తుల సురేష్‌బాబు, పైలెట్ సుందర్‌సింగ్ నాయక్‌లకు లక్ష్మీబాయి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉంటే ఆమె ఇది నాలుగో కాన్పు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి: సీఐటీయూ



ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

క్రోసూరు: దేశవ్యాప్తంగా శుక్రవారం జరగనున్న బంద్‌లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు జి. రవిబాబు కోరారు. కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మండలంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతుల హక్కుల్ని కాలరాసే అనేక చట్టాల్ని తీసుకొచ్చిందని విమర్శించారు. రైతు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 13 నెలల పాటు దేశ రాజధాని ఢిల్లీలో పెద్ద పోరాటం జరిగితే నల్ల చట్టం రద్దు చేస్తానని, పంటలు గిట్టుబాటు ధర చట్టం తీసుకొస్తానని, ఇతర హామీలను ఇచ్చిన మోదీ అమలు చేయకుండా రైతన్నను మోసం చేశారని చెప్పారు. మోదీ మోసపూరిత విధానాల వల్లే తిరిగి ఢిల్లీలో రైతుల పోరాటం ప్రారంభమైయిందని పేర్కొన్నారు. కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలు మార్చి, యజమానుల వద్ద బానిసలుగా మారే విధంగా కోడ్‌లుగా మార్చిందని తెలిపారు. వీటిని వ్యతిరేకిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా క్రోసూరులోని నాలుగు రోడ్ల సెంటర్ నుంచి జరగనున్న నిరసనలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏపూరి వెంకటేశ్వర్లు, షేక్ ముస్తఫా, సీఐటీయూ నాయకులు టి.జగన్నాథం పాల్గొన్నారు.